క్లుప్తంగా

దసరాలోపు గృహప్రవేశం చేయండి

'ఇందిరమ్మ' లబ్ధిదారులకు ఎంపీడీఓ సూచన



నస్దిక్‌సింగారంలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

యాచారం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, దసరా పండుగ లోపు గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ రాధారాణి లబ్ధిదారులకు సూచించారు. సోమవారం ఆమె మండల పరిధి చౌదర్‌పల్లి, నస్దిక్‌సింగారం, కొత్తపల్లి, తక్కళ్లపల్లి తండా, తక్కళ్లపల్లి, యాచారం గ్రామాల్లో నిర్మాణ పనులను గృహ నిర్మాణ శాఖ ఏఈ శిరీషతో కలిసి పరిశీలించారు. పనులను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు.

వసతిగృహాన్ని తొలగించండి



కమిషనర్ అమరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ, ప్రగతినగర్ కాలనీ ఫేజ్– 2లో నివాసాల మధ్య ఏర్పాటు చేసిన బాయ్స్ హాస్టల్‌ను తరలించాలని స్థానికులు డిమాండ్ చేశారు. సోమవారం కమిషనర్ అమరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాలనీ వాసులకు కనీస సమాచారం ఇవ్వకుండా, నిబంధనలకు విరుద్ధంగా డిగ్రీ విద్యార్థుల సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌ను ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఇప్పటికే డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, హాస్టల్ ఏర్పాటుతో పరిస్థితి దయనీయంగా మారనుందని పేర్కొన్నారు. తగిన ఏర్పాట్లు చేయకుండా వసతిగృహాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. దీని కారణంగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే హాస్టల్‌ను తరలించాలని కోరారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాల ఊరేగింపు

ఆమనగల్లు: పట్టణ కేంద్రంలో పోచమ్మ బోనాల పండుగ సోమవారం ఘనంగా జరిగింది. మాల సంఘం ఆధ్వర్యంలో భక్తులు నెత్తిన బోనంతో ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. నైవేద్యంగా బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. సంఘం నాయకులు మల్లయ్య, చెన్నకేశవులు, రమేష్, దేవేందర్, యాదగిరి, శివకుమార్, శివ, ప్రకాష్, శేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా సోమన్న జాతర



అగ్నిగుండం దాటుతున్న భక్తురాలు

యాచారం: మండల పరిధి అయ్యవారిగూడెంలో సోమన్న జాతర సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నెత్తిన బోనంతో భక్తులు అగ్ని గుండంపై నడిచారు. మాల్–మంతన్‌గౌరెల్లి గ్రామాల మధ్యన జాతరలో కాంగ్రెస్ నాయకులు అరవింద్‌నాయక్, కవిత తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ముదిరాజ్.. ముత్యాలమ్మ, పోతురాజుల మూల విగ్రహాల స్థిర యంత్ర ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం: సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ నగరంలో సెప్టెంబర్ 1న నిర్వహించే మహాధర్నా వాల్ పోస్టర్‌ను పీఆర్టీయూ టీఎస్ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీతారెడ్డి, ఎంపీడీఓ వెంకటమ్మ, మండల విద్యాధికారి హీర్యానాయక్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గోతులు ఏర్పడి.. నీరు నిలిచి

అధ్వానంగా బైపాస్ రోడ్డు
- నిర్వహణ లేక.. నిరుపయోగం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- బీటీ నిర్మించాలని స్థానికుల డిమాండ్



ఇబ్రహీంపట్నం శివారులో బైపాస్ దుస్థితి

ఇబ్రహీంపట్నం: రైతుల భూములు సేకరించి నిర్మించిన కృష్ణజలాల పైపులైన్ రోడ్డు(బైపాస్) నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారింది. వినియోగంలో లేక.. పూర్తిగా ధ్వంసమైంది. నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు 20 సంవత్సరాల క్రితం నాగార్జునసాగర్ నుంచి పైపులైన్ ద్వారా నీటిని తరలించారు. ఖానాపూర్ గేట్ సమీపం నుంచి ఇబ్రహీంపట్నం పట్టణ శివార్ల మీదుగా కొహెడ క్రాస్ రోడ్డు వరకు ఈ మార్గాన్ని నిర్మించారు. అక్కడ హైదరాబాద్– నాగార్జునసాగర్ ప్రధాన రహదారికి ఈ పైపులైన్ రోడ్డు అనుసంధానం అవుతుంది.

రూపం కోల్పోయి..

బైపాస్ రోడ్డుగా స్థానికులు పిలుచుకుంటారు. సుమారు ఆరు కిలో మీటర్ల మేర ఉన్న ఈ రహదారిని.. పట్టించుకునే వారు లేక అస్తవ్యస్తంగా మారింది. ఇబ్రహీంపట్నంలో ట్రాఫిక్ సమస్య తలెత్తినప్పుడు ఈ పైపులైన్ మార్గానికి వాహనాలను మళ్లించేవారు. ఇప్పుడు అదికూడా లేకపోవడంతో గోతులు ఏర్పడి, వాటిల్లో వర్షపు నీరు నిలిచింది. ఎంతో ముందు చూపుతో నిర్మించిన రహదారి.. ప్రస్తుతం ఇలా ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లతో రూపం కోల్పోయి దర్శనమిస్తోంది.

కాలినడకన కష్టమే..

అస్తవ్యస్తమైన బైపాస్‌లో ఖానాపూర్ సమీపంలోని దాబా నుంచి భారత్ గార్డెన్ వరకు కనీసం కాలినడకన వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. ఈ మార్గంలో కొత్తగా పయనించిన ద్విచక్ర వాహనదారుల్లో పలువురు ప్రమాదానికి గురై.. ఆస్పత్రి పాలైన సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ రోడ్డు అవసరాన్ని పాలక యంత్రాంగం గుర్తించకపోవడం శోచనీయం. ఇదిలా ఉండగా.. హైదరాబాద్ వాటర్ వర్క్స్ పరిధిలోకి వచ్చే ఈ రోడ్డును.. బీటీగా మారుస్తామని పాలకులు పదేపదే చెప్పారు. కానీ ఆచరణలో పెట్టలేదు. నిర్మాణ పనులకు శిలాఫలకం సైతం వేసి, విస్మరించారు.

తగ్గనున్న దూరభారం

రోడ్డును అభివృద్ధి చేస్తే.. పరిసర గ్రామాల ప్రజలు.. నగరంతో యాచారంకు వెళ్లేందుకు మార్గం సుగుమం కానుంది. పట్నం టౌన్‌లోకి రాకుండా నాగన్‌పల్లి, రాయపోల్, ఖానాపూర్, పొల్కంపల్లి, దండుమైలారం, ముకునూర్, నోముల, మంచాల నుంచి వచ్చివెళ్లే వారికి దూరం తగ్గనుంది

బీటీరోడ్డు వేయండి



బైపాస్‌లో రోడ్డును బీటీగా మారిస్తే రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. దూరభారం తగ్గుతుంది. రహదారిని పునర్నిర్మించి రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలి.

– అశోక్, ఇబ్రహీంపట్నం

మరమ్మతు చేయించాలి



బైపాస్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిస్తే చుట్టూ వెలుస్తున్న కాలనీల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం రోడ్డు అధ్వానంగా మారింది. గుంతలు ఏర్పడి, వర్షపు నీరు నిలుస్తోంది. చెత్తాచెదారం పారబోస్తున్నారు. పాలకులు స్పందించి రోడ్డును మరమ్మతు చేయించాలి.

– బండి మహేశ్, ఇబ్రహీంపట్నం

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాంరెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా పోరాడదామని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు రోజులు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, మాదకద్రవ్యాలపై వ్యాసరచన పోటీలను ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రతిభావంతులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు సీఐ వెంకట్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ ఏడు కొండలు మాట్లాడారు. విద్యార్థులు మత్తుకు బానిస కావద్దని సూచించారు. చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నారు. అనంతరం డ్రగ్స్ అంతం మన పంతం అంటూ ర్యాలీని నిర్వహించారు. 48 ప్రభుత్వ పాఠశాలల నుంచి 1100 మంది విద్యార్థులు టోర్నీలో పాల్గొనగా.. విజేత జట్లకు రూ.5 వేల నగదు ప్రోత్సాహంతో పాటు జ్ఞాపికలు ప్రదానం చేశారు.

విజేత జట్లు

వాలీబాల్‌లో.. బాలికలు జెడ్పీహెచ్‌ఎస్ యాచారం, బాలురు జెడ్పీహెచ్‌ఎస్ రంగాపూర్. కబడ్డీలో బాలికలు, బాలురు జెడ్పీహెచ్‌ఎస్ రాయపోల్. ఖోఖో బాలికలు, బాలురు జెడ్పీహెచ్‌ఎస్ చింతపట్ల పాఠశాల జట్లు విజేతలుగా నిలిచాయి. డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ క్రైమ్‌పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కీర్తన(ప్రభుత్వ పాఠశాల, ఇబ్రహీంపట్నం), అక్షర(జెడ్పీహెచ్‌ఎస్, శేరిగూడ), రామ్‌చరణ్(జెడ్పీహెచ్‌ఎస్, రాయపోల్), శ్రీజ (జెడ్పీహెచ్‌ఎస్, చింతపట్ల), జస్విత(టీపీఎస్, ఆరుట్ల), వైష్ణవి(జెడ్పీహెచ్‌ఎస్, యాచారం) విజేతలుగా నిలిచారు.

ముగిసిన భద్రకాళి బ్రహ్మోత్సవాలు



సామూహిక కుంకుమార్చన చేస్తున్న భక్తులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం చెరువు కట్ట కింద రాతికి స్వయంభువుగా వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిసాయి. ఈ సందర్భంగా ఆదివారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. సోమవారం ఉదయం స్వామి వారికి అభిషేకం, బిల్వ, పుష్పార్చన, ఉమామహేశ్వర వ్రతం, సామూహిక కుంకుమార్చన పూజలను జరిపించారు. ఆలయ చైర్మన్ శెట్టి శివకుమార్, అధ్యక్షుడు మాయిని ఆనందప్ప, ప్రధాన కార్యదర్శి పట్నంశెట్టి విశ్వనాథ్‌ల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి.

కిష్టారెడ్డి సేవలు చిరస్మరణీయం



కడ్తాల్: కిష్టారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఆమనగల్లులో.. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు

కడ్తాల్: దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు అన్నారు. కిష్టారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు పర్యాయాలు కల్వకుర్తి ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ నరేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు లాయక్‌అలీ, యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత ఎడ్మ కిష్టారెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని రాజీవ్ కూడలి వద్ద ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకుడు బాలస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, నాయకులు భాస్కర్, వెంకటేశ్, శివకుమార్, యాదయ్య, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.లక్ష సాయం

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన మారమోని శివకుమార్ నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని సోమవారం స్థానిక వైన్స్ యాజమాన్యం తరఫున గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి, రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. బీచ్యానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, బాలరాజు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఆమనగల్లు: కాలనీలో సమస్యలు పేరుకుపోయాయని, పందుల స్వైర విహారంతో ఇబ్బంది పడుతున్నామని, వాటి నుంచి కాపాడాలని వేంకటేశ్వరకాలనీ ప్రజలు కోరారు. సోమవారం 7వ వార్డు ప్రజలు మాజీ కౌన్సిలర్ విజయ్‌కృష్ణతో కలిసి కమిషనర్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. సుధా ఆస్పత్రి, మానసా గార్డెన్స్ సమీపంలో సీసీరోడ్లు నిర్మించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు ధర్మానాయక్, పాలోజు బ్రహ్మం, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డా.మైమునాబేగం

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యాధికారి డాక్టర్ మైమునాబేగం శిబిర ప్రారంభించారు. కంటి వైద్య సహాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 56 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఇందులో 16 మందిని ఆపరేషన్ నిమిత్తం ఎనుగొండ రాంరెడ్డి క్లబ్ కంటి ఆస్పత్రికి పంపించారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా చైర్మన్ యాదయ్య, ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, పీఆర్‌ఓ పాషా, సభ్యులు చంద్రశేఖర్, రాములు, ఎంపీహెచ్‌ఈఓ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

హుడాకాంప్లెక్స్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్ బస్తీ దవాఖానా, చెరుకుతోటకాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను పరిశీలించారు. చెరుకుతోట కాలనీ యూపీహెచ్‌సీలో గత మూడు సంవత్సరాలుగా డాక్టర్ లేకపోవడం, మందుల సరఫరాలో లోపాలు ఉండటం, చిన్నపిల్లల మందులు తగిన విధంగా అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు స్థానికులు కార్పొరేటర్ శ్రీవాణి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, నాణ్యమైన ఆరోగ్య సేవలు పేదల గడప వద్దకే చేరేందుకు ప్రభుత్వం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. వైద్యులు ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చడం సమంజసం కాదన్నారు. చెరుకుతోట కాలనీ బస్తీ దవాఖానాలో గత మూడేళ్లుగా వైద్యుడే లేరని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పూర్తిస్థాయి వైద్యులను నియమించాలని జిల్లా వైద్యాధికారులను ఆమె కోరారు.

మత్తుకు బానిసలు కావొద్దు



విద్యార్థులతో కలిసి వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన అధికారులు

ఇబ్రహీంపట్నం: మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు అని అధికారులు సూచించారు. మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టాలను వివరిస్తూ సోమవారం గురునానక్ విద్యాసంస్థలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. మాదక ద్రవ్యాల నిరోధక శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సీతారాం నేతృత్వంలో డీఎస్పీ సైదులు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావులు.. మత్తు వలన జరిగే అనర్థాల గురించి వివరించారు. దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకట్ రావు, డైరెక్టర్లు సంజీవ్ శ్రీవాస్తవ, శ్రీనాథ్‌రెడ్డి, ఎస్పీ యాదవ్, పార్థసారథి, భాస్కర్, కోఆర్డినేటర్ త్రిపురసుందరి తదితరుల పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



కందుకూరు: లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, నాయకులు

కందుకూరు: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఓ వరం లాంటిదని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అన్నారు. మండల పరిధిలోని కొత్తగూడకు చెందిన తల్లోజు మాధవాచారి, సొడపు జ్ఞానేశ్వర్‌గౌడ్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.60 వేల చొప్పున నిధులు మంజూరయ్యాయి. సోమవారం ఆ చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేలా తమవంతు కృషి చేస్తున్నామన్నారు. ప్రజాపాలనలో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమం విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బొక్క భూపాల్‌రెడ్డి, బొక్క సంజీవరెడ్డి, సొడపు శేఖర్‌గౌడ్, ఎండీ ఖదీర్, బొక్క హన్మంత్‌రెడ్డి, బొక్క దామోదర్‌రెడ్డి, కుమ్మరి కృష్ణయ్య, శంకర్‌గౌడ్, బాలకృష్ణాచారి పాల్గొన్నారు.

అమీర్‌పేట్‌లో..

మహేశ్వరం: మండలంలోని అమీర్‌పేట్ గ్రామానికి చెందిన కమ్మరి శ్రీనయ్యకు మంజూరైన రూ.30వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సోమవారం మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇమ్మడి ప్రవీణ్‌పటేల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, ఆవుల యాదయ్య, రాజు, ఎర్ర చంద్రమోహన్, ఆవుల రమేశ్, పసునూరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్‌పై చర్యలకు డిమాండ్

బడంగ్‌పేట్: జిల్లాలోని పలు గ్రామాల్లో క్రైస్తవుల కోసం కేటాయించిన భూములను కాజేసే పనిలో పాస్టర్ జాయ్‌తో పాటు మరికొంతమంది కలిసి కుట్రలు చేస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొని.. క్రైస్తవులకు కేటాయించిన స్థలాలను కాపాడాలని కోరుతూ.. సోమవారం రాచకొండ కమిషనరేట్‌లో పలు క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు మాట్లాడుతూ.. ఇటీవల మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన మందుముల సాయిలు అలియాస్ సాయన్న పాస్టర్లందరినీ కలుపుకొని ఏసుక్రీస్తు నామములను ప్రచారం చేస్తూ అందరి మన్ననలను పొందుతున్నారని తెలిసి సాయన్నపై జాయ్ పాస్టర్ నిరాధార ఆరోపణలను చేస్తున్నారని వాటిని ఖండించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని క్రైస్తవుల కోసం కేటాయించిన స్థలాలను జాయ్ పాస్టర్ మరికొంత మంది కబ్జా చేస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. మంత్రులు, రాజకీయ నాయకుల, పోలీసుల అండదండలు ఉన్నాయని బెదిరిస్తూ క్రైస్తవ స్థలాలను కబ్జా చేస్తున్నారన్నారు. జాయ్ పాస్టర్ అతనికి సహకారం అందిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన వినతిపత్రంలో వారు పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో క్రిస్టియన్ కెమిస్ట్రీ అసోసియేషన్, సిలోఫుల్ గాస్పెల్ సొసైటీ, యునైటెడ్ క్రిస్టియన్ చర్చెస్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

బహుజన ధీరత్వానికి ప్రతీక 'పాపన్న'

బడుగుల అభ్యున్నతికి పోరాడిన మహనీయుడు
- గౌడసంఘం నాయకులు
- ఘనంగా పాపన్నగౌడ్ జయంతి



ఆమనగల్లు: పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు/కడ్తాల్: 'బహుజన ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పోరాడిన మహనీయుడు. ఆయన సేవలు చిరస్మరణీయం' అని పలువురు వక్తలు అన్నారు. పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని సోమవారం కల్వకుర్తి, ఇంబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు గౌడ సంఘం ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కడ్తాల్ మండల కేంద్రంలో పీసీసీ సభ్యుడు, గౌడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు పలువురు పాపన్న చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు యాదయ్యగౌడ్, శ్రీశైలంగౌడ్, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

బహుజన ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని గౌడసంఘం కల్వకుర్తి నియోజకవర్గం అధ్యక్షుడు చుక్క అల్లాజీగౌడ్ అన్నారు. పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని సోమవారం ఆమనగల్లు పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీందర్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, వెంకటేశ్‌గౌడ్, బాలకృష్ణగౌడ్, దూసకంటి యాదయ్య, అల్లాజీగౌడ్, నిరంజన్, నర్సింహ పాల్గొన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: బహుజన హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు పాపన్నగౌడ్ అని గౌడసంఘం నాయకులు అన్నారు. సర్దార్ సర్వాయ్ పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు నర్సింహ్మ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, నాయకులు దేవయ్య, వెంకటేశ్, కాటం, శ్రీను, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనాజ్‌పూర్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: గెరిల్లా పోరాటంతో దళిత, బడుగు బలహీన వర్గాల రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్నగౌడ్ పోరాటం చేశారని వక్తలు కొనియాడారు. సర్దార్ సర్వాయ్ పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా అనాజ్‌పూర్‌లో గౌడసంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు రాములుగౌడ్, ఉపాధ్యక్షుడు భిక్షపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి వేడుకలను గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. చెరువు కట్టపై ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు శేఖర్‌గౌడ్, గోపాల్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, రాములు గౌడ్, బుగ్గరాములు, శేఖర్‌గౌడ్, జంగయ్యగౌడ్, నర్సింగ్ ప్రకాశ్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, బాలశివుడు, సాయిగౌడ్‌లు పాల్గొన్నారు.



కడ్తాల్: చరికొండలో..



ఇబ్రహీంపట్నంలో..



కడ్తాల్: పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడసంఘం నాయకులు



మాడ్గులలో..



అబ్దుల్లాపూర్‌మెట్: అనాజ్‌పూర్‌లో..